పాలన సాగేదెట్లా?

● కీలక శాఖల్లో అధికారులు, సిబ్బంది కొరత



ఈనాడు డిజిటల్, సిరిసిల్ల

పరిపాలన సౌలభ్యం.. ప్రజల చెంతకు అధికారులు.. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచేలా పరిపాలన వికేంద్రీకరణ కోసం జిల్లాలను ఏర్పాటు చేశారు. విభజనతో సరిపడా అధికారులు లేక పలు స్థానాలు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. అక్టోబరుతో జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లు పూర్తవుతాయి. కొన్ని శాఖలకు జిల్లా అధికారుల పోస్టులు లేవు. ఇన్‌ఛార్జులతో కొనసాగిస్తున్నారు. ఫలితంగా అధికారులకు పనిభారం.. విధుల నిర్వహణ సవాల్‌గా మారుతోంది. ఇటీవలే ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ముగిసింది. అయినా ఖాళీలు మాత్రం అలాగే ఉండటంతో పరిపాలనపై ప్రభావం పడుతుంది.



జిల్లా సమీకృత పాలనా ప్రాంగణం

● ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలన్నా.. అభివృద్ధి పరుగులు పెట్టాలన్నా జిల్లా అధికారుల పాత్ర కీలకం. ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖలకు జిల్లా అధికారుల పోస్టులే లేవు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా సీనియర్ అసిస్టెంటుకు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో గిరిజన సంక్షేమశాఖ లేదు. కార్యకలాపాలు కరీంనగర్ నుంచే కొనసాగుతున్నాయి. మైనార్టీశాఖను భూసేకరణ విభాగం ప్రత్యేక కలెక్టర్‌కు, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల బాధ్యతలను ఆయా శాఖల్లోని సీనియర్లకు అప్పగించారు. కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివి సకాలంలో విడుదల కాక ఇబ్బందులు తప్పడం లేదు.

● పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దీనికితోడు జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ అధికారులిద్దరు బదిలీపై వెళ్లారు. గ్రామీణాభివృద్ధి అధికారికి డీపీవో, డిప్యూటీ సీఈవోకు డీఎల్‌పీవోలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో ఈనెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు స్వచ్ఛతాహీ సేవా రెండో విడత కార్యక్రమం ప్రారంభమైంది. దీనిపై పర్యవేక్షణ లేక అంతంత మాత్రంగానే సాగుతోంది.

● రహదారులు, భవనాలశాఖ ఈఈ మేలో పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి కరీంనగర్ ఈఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీనికితోడు జిల్లాలో నలుగురు డీఈలకు ఇద్దరు, 12 మంది జేఈలకు ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఇటీవల వర్షాలకు 29 కిలోమీటర్ల మేర రహదారులు శిథిలమయ్యాయి. ఐదు చోట్ల వంతెనలు దెబ్బతిన్నాయి. వీటికి శాశ్వత మరమ్మతులకు రూ.55 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లా అధికారి లేక దస్త్రం ముందుకు కదలడం లేదు.

● జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు పురపాలికల కమిషనర్లు ఉన్నత ఉద్యోగాల పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సెలవుపై వెళ్లారు. వీరి బాధ్యతలను మేనేజర్‌లు చూస్తున్నారు. జిల్లా ఆవిర్భావం నుంచి మెప్మాకు సిరిసిల్ల కమిషనర్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

● కలెక్టరేట్‌లో తూనికలు, కొలతలు, డ్రగ్స్ కంట్రోల్, లీడ్ బ్యాంకుకు సంబంధించిన కార్యాలయాలు లేవు. ఖాళీగా ఉన్న అధికారుల పోస్టులపై కలెక్టరేట్ ఏవో రాంరెడ్డిని 'ఈనాడు' సంప్రదించగా జిల్లా అధికారుల పోస్టింగ్‌లు రాష్ట్రస్థాయిలోనే జరుగుతాయని తెలిపారు.

● జిల్లాకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ పోస్టు మంజూరు కాలేదు. మొన్నటి వరకు ఇన్‌స్పెక్టర్‌కే ఏడీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఇతను బదిలీ కావడంతో సిద్దిపేటలోని ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు. ఇప్పటికే జిల్లాలో ఐదు మండలాలకు సర్వేయర్లు ఖాళీగా ఉన్నారు. సర్వే కోసం మూడు వేల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సిద్దిపేట జిల్లా మత్స్యశాఖ అధికారి ఈ జిల్లా బాధ్యతలు చూస్తున్నారు.

● జిల్లాలో ప్రజారోగ్య శాఖ పోస్టు ఉన్నప్పటికీ సిరిసిల్ల పురపాలక డీఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. వేములవాడ పురపాలక పట్టణ ప్రణాళిక అధికారికి వీటీఏడీఏ కార్యదర్శి, జిల్లా పట్టణ ప్రణాళిక అధికారి బాధ్యతలు కూడా చూస్తున్నారు.

భవనాలు నిర్మించి... దారి మరిచారు



కోనరావుపేట మండల కేంద్రంలో రూ.1.5 కోట్లు వెచ్చించి అధునాతన పాఠశాల, వంటశాల, డార్మెటరీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల వసతి భవనాలను నిర్మించారు. పాఠశాలలో మూడు నుంచి 9వ తరగతి వరకు 90 మంది విద్యను అభ్యసిస్తున్నారు. ప్రధాన రహదారికి సమారు 200 మీటర్ల దూరంలో పాఠశాల భవనం ఉన్నప్పటికీ స్థల సమస్య కారణంగా అటవీ ప్రాంతాన్ని ఆనుకుని దారి ఏర్పాటు చేశారు. దీంతో అర కిలోమీటరు వరకు దూరాభారం నెలకొంది. మరోవైపు ఈ మార్గం ఇరుకుగా ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పక్కా రహదారి నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కోనరావుపేట

కేసుల పరిష్కారానికి సహకరించండి

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: కేసుల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైశ్వాల్ పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎన్.ప్రేమలత ఆదేశాల మేరకు మంగళవారం కోర్టు ఆవరణలో ఆమె న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకట్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైశ్వాల్

ఆయిల్‌పాం సాగు.. బహుబాగు

ముస్తాబాద్ మండలం జిల్లాకే ఆదర్శం

న్యూస్‌టుడే, ముస్తాబాద్



నేరెల్లలో తోటను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ జిల్లా అధికారి లత

రైతులు ఒకే తరహా పంటలు సాగు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఏడాదంత కష్టపడినా పెట్టుబడి పోగా మిగిలేది ఏమీలేకుండా పోతుంది. దీంతో ఆర్థికంగా నష్టపోయి అప్పుల పాలవుతున్నారు. డిమాండ్ ఉన్న పంటలు వేస్తే రైతు నష్టపోయే పరిస్థితి ఉండదు. ఈ క్రమంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు సామాన్యులకు నూనె ధరలను అందుబాటులో తీసుకురావడానికి ఆయిల్‌పాం సాగును అధికారులు ప్రోత్సహిస్తున్నారు. దీన్ని ముస్తాబాద్ మండలంలోని పలువురు రైతులు అందిపుచ్చుకున్నారు. ఈ తోటలసాగులో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచి ఆదర్శంగా నిలిచింది.

జిల్లాలో 2022 నుంచి ఇప్పటి వరకు 657 మంది రైతులు 2,034.97 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలను సాగు చేశారు. ఇందులో ముస్తాబాద్ మండలంలో అత్యధికంగా సాగు చేయడం గమనార్హం.

■ ఆయిల్‌పాం తోటల సాగు కోసం ప్రభుత్వం రాయితీ అందిస్తుంది. మొక్క ఖరీదు రూ. 193 కాగా రైతులు తమ వాటాగా రూ. 20 చెల్లించాల్సి ఉంటుంది.

■ బిందు సేద్యం పరికరాలకు మొత్తం యూనిట్ ధర రూ. 49,059 కాగా, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీపై అందిస్తున్నారు.

■ చిన్న, సన్న కారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీ ఇస్తున్నారు.

■ ఒకసారి ఆయిల్‌పాం మొక్క నాటితే 30 సంవత్సరాల వరకు దిగుబడి పొందవచ్చు.

■ నీటి వసతి సమృద్ధిగా ఉండి, నీరు నిల్వని సారవంతమైన నెలలు సాగుకు అనుకూలంగా ఉంటాయి.

■ ఎకరానికి 57 మొక్కలు త్రికోణ పద్ధతిలో, 50 మొక్కలు చతురస్రాకార పద్ధతిలో 9 మీటర్ల దూరంలో నాటాలి.

అయిదెకరాల్లో...

నేను అయిదెకరాల్లో ఆయిల్‌పాం తోటను సాగు చేశాను. ప్రభుత్వం నుంచి డ్రిప్‌నకు 80 శాతం రాయితీ ఇచ్చారు. నిర్వహణ కోసం ఎకరానికి రూ. 4 వేలు ఇస్తున్నారు. పదిహేను రోజులకోసారి సంబంధిత అధికారులు వచ్చి తోటను సందర్శిస్తున్నారు. సూచనలు, సలహాలు అందిస్తున్నారు. వైద్య వృత్తిలో కొనసాగుతూనే మన ప్రాంత ప్రజలకు నూనెలు చౌకగా లభించాలనే ఉద్దేశంతో సాగు చేశాను.

- డాక్టర్ చంద్రశేఖర్‌రావు, ముస్తాబాద్

రైతులు దృష్టిసారించాలి

నీరు సమృద్ధిగా ఉన్న రైతులు ఆయిల్‌పాం సాగుకు ముందుకు రావాలి. 2024-25 సంవత్సరానికిగాను 1,500 ఎకరాల్లో సాగు చేయాలన్నది లక్ష్యంగా నిర్దేశించాం. 12 నెలల వయసున్న మొక్కలు అందుబాటులో ఉన్నాయి. పొలంలో నీరు సమృద్ధిగా ఉంటే బిందు సేద్యంతో సంబంధం లేదు. రైతులు పంట మార్పిడిలో భాగంగా ఈ సాగుపై దృష్టిసారించాలి.

- లత, ఉద్యానవనశాఖ జిల్లా అధికారి

మండలాల వారీగా సాగు వివరాలు(ఎకరాల్లో)


మండలం	రైతులు	ఆయిల్‌పాం సాగు			
ముస్తాబాద్	106	501.69	గంభీరావుపేట	46	122.25
తంగళ్లపల్లి	102	312.82	వేములవాడ గ్రా॥	39	115.89
బోయినపల్లి	105	264.76	చందుర్తి	29	59.81
ఇల్లంతకుంట	72	221.34	సిరిసిల్ల	17	40.44
కోనరావుపేట	68	180.82	వేములవాడ ప॥	14	38.99
ఎల్లారెడ్డిపేట	37	127.17	వీర్నపల్లి	14	28.12
			రుద్రంగి	8	20.88

ఆరోగ్య బీమాతో ధీమాగా..!

● ఉమ్మడి జిల్లాలో 30 శాతం కుటుంబాలకు పాలసీలు
● కరోనా తరవాత పెరిగిన అవగాహన

● గోదావరిఖనికి చెందిన ఏడాది చిన్నారికి తండ్రి వైద్య బీమా చేయించారు. కొద్ది రోజులకే ఆ చిన్నారికి జ్వరం రావడంతో ప్లేట్‌లెట్లు తగ్గాయి. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమయానికి అందిన వైద్యంతో సురక్షితంగా ఇంటికి చేరుకుంది. చికిత్స ఖర్చు రూ.2 లక్షలు. ఆరోగ్య బీమా ఉండటంతో రూపాయి భారం పడకుండా ఆస్పత్రి బిల్లులు చెల్లించారు.

న్యూస్‌టుడే, గోదావరిఖని



ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ప్రస్తుతం ఆరోగ్య బీమాపై అవగాహన పెరగడంతో చాలామంది మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వారు ఆస్పత్రుల ఖర్చు భారం పడకుండా జాగ్రత్త పడుతున్నారు. కరోనా సమయంలో వైద్య చికిత్సకు రూ.లక్షల్లో బిల్లులు అవడంతో అవగాహన పెరిగి జనం ఆరోగ్య బీమా పాలసీలు తీసుకోవడంపై దృష్టి పెట్టారు. దీంతో ఆ కంపెనీల వ్యాపారం పెరుగుతుండగా.. అనారోగ్య పరిస్థితులు తలెత్తినప్పుడు పాలసీదారులకు ఉపయుక్తంగా మారుతోంది.

● ఉమ్మడి జిల్లాలో 942 ప్రైవేటు ఆస్పత్రులు ఉండగా.. ఇందులో ఇన్ పేషంట్లుగా చేరుతున్న వారిలో 30 శాతం వరకు ఆరోగ్య బీమా పాలసీల ద్వారానే వైద్యం చేయించుకుంటున్నారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులైతే శాఖాపరంగా వచ్చే బీమా సౌకర్యంతో, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ రంగాల వారు తాము చేసుకున్న పాలసీలతో వైద్యం పొందుతున్నారు.

● గతంలో ఆస్పత్రుల్లో చేరితే రూ.లక్షల్లో అప్పు చేయాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో మధ్య తరగతి వారు చాలామంది ఆరోగ్య బీమా చేయించుకుని అత్యవసర సమయంలో ఖర్చుల భారం లేకుండా చేసుకుంటున్నారు.

● నిరుపేద కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డు ద్వారా ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వర్తిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 30 శాతం మంది వీటి పరిధిలోనే వైద్యం పొందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారు ఆయా శాఖల ద్వారా ఆరోగ్య బీమా సౌకర్యం పొందుతున్నారు. ఈ కుటుంబాలు లక్ష వరకు ఉంటాయి. ఇక ఏ అవకాశం లేని కుటుంబాల్లో మరో 30 శాతం మంది ప్రైవేటు సంస్థల ద్వారా బీమా చేయించుకుని వైద్య సేవలు పొందుతున్నారు.

● ఉమ్మడి జిల్లాలో రూ.5 లక్షల పరిమితి వరకు పాలసీలు ఎక్కువ మంది తీసుకుంటున్నారు. 3 లక్షల కుటుంబాలకు ప్రైవేటు బీమా పాలసీలు ఉండగా అందులో దాదాపు రెండు లక్షల కుటుంబాలు రూ.5 లక్షల పరిమితి పాలసీ తీసుకున్నాయి.

● ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే డబ్బు కోసం ఇతరులపై ఆధారపడకుండా వెంటనే ఆస్పత్రుల్లో చేరేందుకు బీమా సౌకర్యం ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో అండగా..

వైద్య సేవలు పొందేందుకు ఆరోగ్య బీమా చేయించుకోవాలన్న అవగాహన పెరిగింది. ఇటీవల వైద్యం కోసం వస్తున్న వారిలో ఎక్కువ శాతం ఆరోగ్య బీమా కార్డు ద్వారానే సేవలు పొందుతున్నారు. దీని వల్ల అత్యవసర పరిస్థితిలో రోగుల కుటుంబాలకు డబ్బు గురించి హైరానా పడాల్సిన పరిస్థితి తప్పింది. పలు కారణాలతో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. వైద్యానికి భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆరోగ్య బీమా కొంత ధీమా కల్పిస్తోంది.

- దామెర అనిల్‌కుమార్, ఐఎంఏ రామగుండం అధ్యక్షుడు

పీహెచ్‌సీకి ల్యాబ్ టెక్నీషియన్ కేటాయింపు

ఈనాడు స్పందనకు వందనం

కోనరావుపేట, న్యూస్‌టుడే: కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ల్యాబ్ టెక్నీషియన్‌ను కేటాయించినట్లు మండల వైద్యాధికారి కోన వేణుమాధవ్ తెలిపారు. ఈనెల 20న 'ఈనాడు' లో 'నిధులు రాక....సమస్యలు తీరక' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేట పీహెచ్‌సీలో పని చేస్తున్న రమేశ్‌ను వారానికి మూడు రోజులు కోనరావుపేటలో విధులు నిర్వహించేలా నియమించినట్లు వైద్యాధికారి పేర్కొన్నారు.

మందుబాబులకు అడ్డాగా సర్కారు బడి

బండలింగంపల్లి (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బడి ఆవరణలో మద్యం తాగిన అనంతరం ఖాళీ బీరు సీసాలను అక్కడే వదిలివెళ్లారు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం పాఠశాలకు చేరుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు సీసాలను చూసి కంగుతిన్నారు. సమాచారం అందుకున్న డీఈవో రమేశ్‌కుమార్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో మద్యం తాగిన విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల లోపలికి మందుబాబులు రాకుండా, ఇతర అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డికి సూచించారు. అలాగే పాఠశాలకు గేటు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే గేటు బిగించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. పదో తరగతి గదికి వెళ్లి, విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత నమోదవడంతోపాటు విద్యార్థులు 10 జీపీఏ సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.



పాఠశాలలో మందుబాబులు వదిలివెళ్లిన ఖాళీ బీరు సీసాలు

పశు దవాఖానాలపై నిర్లక్ష్యం

సౌకర్యాలు కల్పించని ప్రభుత్వం

గ్రామీణ ప్రాంతాల్లో అనేక కుటుంబాలు గొర్రెలు, మేకలు, పాడి గేదెల పోషణ ద్వారా ఉపాధి పొందుతున్నాయి. అయితే వాటికి ఏదైనా జబ్బు చేస్తే మెరుగైన వైద్యం అందని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని పశువైద్యశాలల్లో వసతుల లేమి, మరోవైపు భారీగా పోస్టుల ఖాళీలు ఉండటమే ఇందుకు కారణం. పలు దవాఖానాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకున్న నాథుడు కనిపించడం లేదు.

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట

సిరిసిల్లలోని ప్రాంతీయ పశువైద్యశాలతోపాటు జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రాథమిక పశువైద్యశాలలు, ఉపకేంద్ర భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

■ 2014లో మంజూరైన ఆర్ఐడీఎఫ్ కేంద్ర నిధులతో చందుర్తి, రుద్రంగి, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లో నాలుగు ఆసుపత్రులకు భవనాలు నిర్మించారు.

■ తంగళ్లపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, కోనరావుపేట, రాచర్ల గొల్లపల్లి, గాలపల్లి, హన్మాజీపేట, నిజామాబాద్, మానాలలోని ప్రాథమిక పశువైద్య కేంద్రాలు, అలాగే కొత్తపల్లి, ఆవునూరు, పోత్గల్, బండలింగంపల్లి, వీర్నపల్లి, శాత్రాజుపల్లి, నూకలమర్రి, రుద్రవరం, సుద్దాల, ఎన్గల్, కోరెం, కొదురుపాక గ్రామాల్లోని ఉపకేంద్రాల భవనాలకు భారీగా మరమ్మతులు చేయాల్సి ఉంది.



వీర్నపల్లిలో శిథిలావస్థకు చేరిన గ్రామీణ పశు ఆరోగ్య ఉప కేంద్ర భవనం

■ ఆయా కేంద్రాల్లో విద్యుత్తు, గేట్లు, తలుపులు, కిటికీలు, ప్రహరీ, ఫ్యాన్‌లు తదితర సౌకర్యాలను కల్పించాల్సి ఉంది.

■ కొన్ని మండలాల్లో ఇరుకుగదులు, అరకొర వసతుల నడుమ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. కనీసం నీటి సౌకర్యం కూడా లేదు. మూత్రశాలలు కరవవడంతో మహిళా అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

■ భవనాల మరమ్మతుల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా సర్కారు స్పందించి పశువైద్య దవాఖానాల్లో కనీస వసతులు కల్పించి, ఇబ్బందులు తీర్చాలని పశుపోషకులు కోరుతున్నారు.


జిల్లాకు ఐదుగురు వైద్యులే దిక్కు

పశుసంవర్ధకశాఖలో జిల్లాలో మొత్తం 17 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు గాను కేవలం ఐదుగురు వైద్యులు మాత్రమే (రెగ్యులర్) ఉన్నారు.

■ మొత్తం 12 వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండగా ముస్తాబాద్, తంగళ్లపల్లి ప్రాథమిక పశువైద్యకేంద్రాల(పీవీసీ)లో ఇద్దరు ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్నారు.

■ 32 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు గాను 21 ఖాళీలున్నాయి.

చిన్నపాటి ఇరుకు గదిలో నిర్వహిస్తున్న ఈ పశువైద్యశాల ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోనిది. కనీసం నీరు, మూత్రశాలల సౌకర్యం కూడా లేదు. 2019లో రూ. 4.60 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. నిధుల లేమితో స్లాబ్‌స్థాయిలో నిలిచిపోయాయి.



మండలాల వారీగా పశువుల వివరాలు ఇలా...

మండలం	పశువుల సంఖ్య				
రుద్రంగి	11,349	వేములవాడ అర్బన్	53,333	గంభీరావుపేట	1,25,108
చందుర్తి	92,112	వేములవాడ రూరల్	35,630	ముస్తాబాద్	2,01,059
బోయినపల్లి	146,925	కోనరావుపేట	72,083	సిరిసిల్ల	78,115
		వీర్నపల్లి	39,319	తంగళ్లపల్లి	63,511
		ఎల్లారెడ్డిపేట	78,523	ఇల్లంతకుంట	89,982

నిధుల కోసం ఐదేళ్లుగా ప్రయత్నిస్తున్నాం

ఇటీవల బదిలీల్లో 65 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నాం. అయితే కొత్తగా భర్తీ చేస్తే జిల్లాకు ప్రాధాన్యతనివ్వాలని ప్రభుత్వానికి నివేదించాం. నూతన భవనాలు, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టేందుకు నిధుల మంజూరు కోసం ఐదేళ్లుగా ప్రయత్నిస్తున్నాం. 17 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకుగాను ఐదుగురు మాత్రమే రెగ్యులర్ వారు ఉన్నారు. మరో ఇద్దరు కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్నారు. త్వరలోనే ఇబ్బందులు తీరుతాయని ఆశిస్తున్నాం.

- వి.రవీందర్‌రెడ్డి, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి

పట్టు పెరుగుతోంది


మల్బరీ మొక్కల పెంపకం


● ఉమ్మడి జిల్లాలో మల్బరీ సాగుపై రైతుల ఆసక్తి

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

ఉమ్మడి జిల్లాలో సాగు అనుబంధంగా పట్టుపురుగుల పెంపకం ఏటికేడు విస్తరిస్తోంది. రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా మల్బరీసాగు నాలుగు జిల్లాల్లో దాదాపుగా 279 ఎకరాలకు విస్తరించగా మరో 90 మంది వరకు నూతనంగా పట్టు పురుగుల పెంపకానికి దరఖాస్తు చేయటం సాగు సానుకూలతను వెల్లడిస్తోంది.

రాయితీలు

సిల్క్ సమగ్ర పథకం ద్వారా మల్బరీ మొక్కలు, పట్టుపురుగుల పెంపకానికి పలు రాయితీలు ఇస్తున్నారు. సాధారణ రైతులకు 2 ఎకరాల్లో సాగుకు 60 వేలు ఇస్తుండగా ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ. 78 వేలు ఇస్తున్నారు. పట్టుపురుగులను పెంచే షెడ్డు నిర్మాణానికి రూ.5-6.5 లక్షలు ఖర్చవుతుండగా జనరల్ రైతులకు రూ.2.25 లక్షలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.2.95 లక్షలను రాయితీగా ఇస్తున్నారు. షెడ్డులో అమర్చే ఒక్కో స్టాండ్స్‌కు రూ.17 వేలు, నేత్రికలు, ట్రేలు, ఇతర సామగ్రికి రూ.4 వేలు, రోగ నిరోధక మందులకు రూ.2,500 నుంచి రూ.3,250 చొప్పున నిధులను ఇస్తున్నారు. గతంలో పట్టుగూళ్లకు కిలోకు రూ.75 చొప్పున రైతులకు ఇచ్చిన ఇన్సెంటివ్ మొత్తాన్ని పెంచి కొనసాగించాల్సి ఉంది. ఉద్యానశాఖద్వారా, పొలాసలోని వ్యవసాయ కళాశాలలోనూ పట్టుపురుగుల పెంపకంపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు.



...న్నారు. 100 గుడ్లకు 80 కిలోల వరకు పట్టుగూళ్లు వస్తుండగా కిలోకు కుకూన్ ధర రూ.550-670 వరకుంది. హైదరాబాద్, జనగాంలో పట్టుగూళ్ల విక్రయ మార్కెట్లున్నాయి. 25-35 రోజులకొక పంట పూర్తవుతుండగా ఖర్చులుపోనూ ఎకరాకు కనీసం రూ.80 వేల నుంచి రూ.1.30 లక్షల వరకు ఆదాయం వస్తోంది. పట్టు పురుగులపై ఆశించే తెగుళ్లను సమర్థంగా నిరోధించటం, పట్టుగూళ్లు అల్లుకునే దశల్లో ఇంటిల్లిపాది శ్రమించటంవల్ల రైతులు సత్ఫలితాలను సాధిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

దిగుబడి

మల్బరీ మొక్కలను ఒకసారి నాటితే నిరంతరం కాపు వస్తుంది. చీడపీడల బెడద ఉండదు. పట్టుసాగును చేపట్టిన తొలిసారే షెడ్డు, చంద్రికలు, తడకలు, నెట్లు తదితరాలకు పెట్టుబడి ఉంటుంది. తరువాతి పంటలకు కేవలం గుడ్లను కొనటం, మందు ద్రావణం, కూలీల ఖర్చు తదితర చిన్నచిన్న పెట్టుబడులు మాత్రమే ఉంటాయి. మల్బరీ ఇది వరకు సాగుచేస్తున్నవారు ఏడాదిలో సరాసరిగా 6-8 పంటలవరకు కాపు తీసుకు...


పట్టుపురుగులు

ఏడాది పొడవునా ఆదాయం



పట్టుపురుగుల పెంపకంతో ఏడాది పొడవునా నికరాదాయం పొందవచ్చు. పట్టుపురుగులపై వచ్చే తెగుళ్లపట్ల అప్రమత్తంగా ఉంటే ఎకరా విస్తీర్ణంలోని పంటకు కనీసం 1.20 క్వింటాళ్లకు పైగా పట్టుగూళ్లు వస్తాయి. ప్రభుత్వం పట్టుగూళ్లకు ఇన్సెంటివ్‌ను పెంచి ఇచ్చినట్లయితే మరింత ప్రోత్సాహకంగా ఉంటుంది.

- నేరెళ్ల చంద్రమౌళి, రైతు, కల్లెడ, జగిత్యాల మండలం

ప్రతిభకు వేదిక.. బాలల వేడుక

ఈ నెలాఖరులో కళోత్సవ్

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం

ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు పాఠ్యేతర అంశాలపై ఆసక్తి చూపుతున్నారు. పాఠశాలల్లో జరిగే ప్రత్యేక దినోత్సవాల కార్యక్రమాల్లో వివిధ కళల్లో తమదైన ప్రతిభను చాటుకుంటున్నారు. ఇలాంటి వారిని ఒక వేదికపైకి తీసుకొచ్చి వారిలోని ప్రతిభను వెలుగులోకి తెచ్చి ప్రోత్సహించేందుకు రాష్ట్ర విద్యాశాఖ కళోత్సవ్ పేరుతో పోటీలను నిర్వహిస్తోంది. ఎన్‌సీఈఆర్టీ వారు రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్‌తో కలిసి పలు సంప్రదాయ కళాంశాల్లో విద్యార్థుల ప్రదర్శనలకు ఇది వేదికగా నిలిచేలా మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో జిల్లా, మండల స్థాయిలో విద్యార్థులకు ఈ నెలాఖరులో పోటీలను నిర్వహించనున్నారు. మూడేళ్లుగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పలు ప్రదర్శనల్లో ప్రతిభ చాటిన సందర్భాలున్నాయి.

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
కరీంనగర్	929	1,12,829
జగిత్యాల	1,069	1,23,315
పెద్దపల్లి	712	80,282
సిరిసిల్ల	602	61,579



గత కళోత్సవ్‌లో విద్యార్థి నృత్యం

ఆరు అంశాల్లో పోటీలు

గతంలో పది కళాంశాల్లో పోటీలు నిర్వహించగా, ఈ విద్యా సంవత్సరంలో ఆరు అంశాల్లో నిర్వహిస్తున్నారు. వోకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, నృత్యం, థియేటర్, విజువల్ ఆర్ట్స్, సంప్రదాయ కథలు చెప్పడం వంటి అంశాల్లో పోటీలు జరుగనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల్లో 9వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికై విజేతలుగా నిలిచిన వారికి నగదుతోపాటు ప్రశంసాపత్రాలను అందిస్తున్నారు. పోటీల్లో ప్రతి విద్యాసంస్థ నుంచి ఒక్కో విభాగంలో ఒక బాలుడు, ఒక బాలికను అనుమతిస్తారు. పోటీలకు సంబంధించిన వివరాల కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయా జిల్లాల్లోని సమగ్ర శిక్షా అధికారులను సంప్రదించి పూర్తి సమాచారాన్ని పొందే వీలుంది.

ప్రోత్సహిస్తే ప్రయోజనం

కళల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపడంలో ముందు వరుసలో నిలుస్తున్నారు. టీవీలు, సామాజిక మాధ్యమాల సౌజన్యంతో వారికి ఇష్టమైన అంశంలో ప్రావీణ్యం పెంచుకుంటున్నారు. తల్లిదండ్రులు పలు అంశాల్లో బాలలకు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తున్నారు. పాఠశాలల్లో జరిగే పలు కార్యక్రమాల్లో విద్యార్థులు పలు అంశాల్లో రాణిస్తూ అందరిని అలరిస్తున్నారు. ఇప్పుడు కళోత్సవ్‌లో పాల్గొనేందుకు వారికి ఆసక్తి ఉన్నా వారిని ప్రోత్సహించి వారి ప్రతిభకు మరింత మెరుగులు దిద్దే చర్యలు ఉపాధ్యాయులు చేపడితే వారు మరింత రాణించే అవకాశముంది.

విద్యార్థులు పాల్గొనేలా చర్యలు

- కె.అశోక్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి, కరీంనగర్

వివిధ కళల్లో ఆసక్తి గల విద్యార్థులకు కళోత్సవ్ మంచి అవకాశం. ఉపాధ్యాయులు ఆసక్తి గల విద్యార్థులను ఈవైపు ప్రోత్సహించాలి. ఈ నెలాఖరులో పోటీలు ఉంటాయి.

18 తులాల బంగారు ఆభరణాలు మాయం

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇంట్లోని రూ.3.50 లక్షలు అలాగే ఉన్నా.. 18 తులాల బంగారు ఆభరణాలు మాత్రం అపహరణకు గురైన ఘటన మిస్టరీగా మారింది. కరీంనగర్ రెండో ఠాణా పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్న పిట్టల ప్రశాంత్ గ్రానైట్ క్వారీ సంస్థ కొనసాగిస్తున్నారు. అతడు మంగళవారం క్వారీ వద్దకు వెళ్లగా ఆయన భార్య లహరి మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లింది. ఇంటికి వచ్చి తాళం తీసి లోనికి వెళ్లగా మరోవైపు ఉన్న తలుపులు తెరచి ఉన్నాయి. అనుమానంతో బీరువాలో చూడగా 18 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బీరువాలో మరోవైపున రూ.3.50 లక్షల నగదు భద్రంగానే ఉంది. ఈ మేరకు సమాచారం అందుకున్న నగర ఏసీపీ నరేందర్, రెండో ఠాణా సీఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు బడితండా వాసి ఎంపిక

రుద్రంగి, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో అక్టోబర్ 22న నిర్వహించే జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు రుద్రంగి మండలం బడితండా గ్రామానికి చెందిన విద్యార్థి మాలోత్ అనిల్ ఎంపికయ్యాడు. అనిల్ ప్రస్తుతం కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల శాతవాహన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ట్రెక్కింగ్ పోటీల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో కళాశాల అధ్యాపక బృందంతోపాటు బడితండా వాసులు అతనిని అభినందించారు.


అనిల్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

పేరుకే కమిటీలు.. పరిష్కారం కాని సమస్యలు

న్యూస్‌టుడే, హుజూరాబాద్

పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లాలోని పురపాలికలు, నగరపాలికల్లో ఏర్పాటుచేసిన వార్డు కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి. అభివృద్ధి పనుల్లో పాలకవర్గం, అధికార యంత్రాంగంతోపాటు ప్రజలను భాగస్వాములను చేసే లక్ష్యంతో 2020 ఏప్రిల్‌లో గత ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. నాలుగేళ్లు దాటినా ఈ కమిటీల సలహాలు, సూచనలు తీసుకోకుండా నిర్వీర్యం చేశారు. ఫలితంగా అభివృద్ధి పనుల్లో వీరి భాగస్వామ్యం పూర్తిగా కొరవడింది.

పురపాలికల్లో వీటి భాగస్వామ్యం శూన్యం

401 వార్డులు.. 1844 కమిటీలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 14 పురపాలికలతోపాటు.. కరీంనగర్, రామగుండం నగరపాలికల్లోని 401 వార్డుల్లో 1844 కమిటీలను ఏర్పాటుచేశారు. ఇందులో 27,660 మంది సభ్యులున్నారు. ఒక్కో వార్డుకు నాలుగు కమిటీల చొప్పున ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులతో. యువకులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిపి వీటిని ఏర్పాటు చేశారు.

సమావేశాల ఊసే లేదు..

ప్రతి వార్డుకు కమిటీలను నియమించి సభ్యులకు లక్ష్యాలు నిర్దేశించారు. అయితే ఏర్పాటు సమయంలో చూపిన ఆసక్తి. ఆ తర్వాత పూర్తిగా కొరవడింది. వార్డు కమిటీ సభ్యులతో రెండు, మూడు నెలలకో సారి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి.. చేపట్టాల్సిన పనులు, సమస్యలపై చర్చించాలి. అనంతరం అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా పనులను ఎంపిక చేసి వార్డు అధికారి ద్వారా పురపాలక కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలి. కమిషనర్ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి ఆయా సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాల్సి ఉంది. అయితే ఒక్కసారి కూడా కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించడం, అభివృద్ధి పనుల ప్రణాళికలు రూపొందించిన దాఖలాలు లేవు. ఫలితంగా సమస్యలు వెంటాడుతున్నాయి.


హుజూరాబాద్‌లోని పద్మానగర్‌లో బురద రోడ్డుతో అవస్థలు

ఉమ్మడి జిల్లాకు సంబంధించిన వివరాలు..

జిల్లా	పురపాలికలు	వార్డులు	కమిటీలు	సభ్యులు
కరీంనగర్	4	146	584	8,760
జగిత్యాల	5	134	536	8,040
పెద్దపల్లి	3	114	456	6,840
సిరిసిల్ల	2	67	268	4,020


హుజూరాబాద్‌లోని పురపాలిక సంఘ కార్యాలయం

ఈ ప్రభుత్వం అయినా పట్టించుకునేనా?

ఆయా వార్డుల్లో వనమహోత్సవం, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, అక్రమ నిర్మాణాల గుర్తింపు తదితర అంశాలపై పాలకవర్గం, అధికార యంత్రాంగం ఈ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకొని ఆయా పనులను చేపట్టాల్సి ఉంటుంది. కానీ నాలుగేళ్లుగా ఈ కమిటీల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా నిర్వీర్యం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాకనైనా వీటికి ప్రాధాన్యత ఇస్తుందని ఆశించినా.. ఆ దిశగా చర్యలు మాత్రం చేపట్టలేదు. అసలు వార్డు కమిటీలు ఉన్నాయనే విషయం కూడా చాలా మందికి తెలియదంటే వీటి ప్రాధాన్యత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రాజన్న హుండీ ఆదాయం రూ.1.44 కోట్లు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ హుండీని అధికారులు మంగళవారం లెక్కించారు. 12 రోజులకు రూ.1,44,06,154 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. బంగారం 710 గ్రాములు, వెండి 14 కిలోలను భక్తులు కానుకల రూపంలో స్వామివారికి సమర్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం పరిశీలకుడు సత్యనారాయణ, ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ మహిళలు పాల్గొన్నారు.


కానుకలు లెక్కిస్తున్న ఉద్యోగులు తదితరులు

శ్రీరామసాగర్‌కు పెరిగిన వరద

జగిత్యాల ధరూర్ క్యాంపు, న్యూస్‌టుడే: గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి వరద మంగళవారం సాయంత్రం వరకు 45,858 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టు నుంచి వరదకాలువకు నీటివిడుదలను 15 వేల క్యూసెక్కులకు పెంచి మధ్యమానేరు జలాశయానికి తరలించనున్నారు. ఇన్‌ఫ్లో పెరగటంతో 7 గేట్లను తెరచి 21,868 క్యూసెక్కుల మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో నీటినిల్వ 80.501 టీఎంసీలుగా, నీటిమట్టం 1091 అడుగులుగా ఉంది. ప్రాజెక్టునుంచి గోదావరి నదిలోకి, వరదకాలువకు నీటిని విడుదల చేస్తున్నందున మత్స్యకారులు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.


వరద కాలువలో నీరు

ఓ మోస్తరు నుంచి భారీ వర్షసూచన

ఉమ్మడి జిల్లాలో రాగల అయిదు రోజుల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్ష సూచన ఉందని జగిత్యాల పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతోకూడిన వర్షసూచన ఉందన్నారు. 22-24 డిగ్రీల కనిష్ఠ, 33-34 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నెలకొంటాయని సూచించారు.

మధ్యమానేరుకు 8,200 క్యూసెక్కులు

బోయినపల్లి: రాజరాజేశ్వర జలాశయానికి వరద కొనసాగుతుంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 6 వేలు, మానేరు, మూలవాగుల నుంచి 2200 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 24.33 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా నీటి విడుదల ఉంటుందని అధికారులు తెలిపారు. జలాశయం దిగువన మానేరు వాగులో రైతులు తమ మోటార్లు తొలగించాలని సూచించారు.

నవోదయ విద్యాలయ ప్రవేశానికి గడువు పొడిగింపు

చొప్పదండి, న్యూస్‌టుడే: నవోదయ పాఠశాలలో 2025-26 సంవత్సరానికిగాను ఆరో తరగతి ప్రవేశ గడువు వచ్చే నెల 7 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక పొరపాట్లు సరిదిద్దుకోవడానికి అక్టోబరు 8 నుంచి 9 వరకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

పీజీ ఫలితాలు విడుదల

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జులై, ఆగస్టులో నిర్వహించిన పీజీ ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ (ఆంగ్లం, ఉర్దూ, తెలుగు, ఎకనామిక్స్, సోషియాలజీ, ఎంఎస్‌డబ్ల్యూ), ఎమ్మెస్సీ (బాటనీ, జంతుశాస్త్రం, స్టాటిస్టిక్స్, న్యూట్రిషన్), ఎంసీఏ నాలుగు, రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

బ్యాంకు ఖాతాల నుంచి రూ.20 లక్షలు మాయం

● కేసును ఛేదించిన కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: నమ్మకంగా మెదిలి బ్యాంకు ఖాతాల నుంచి రూ.20 లక్షలు కాజేసిన ఘటన ఇది. రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని నీటిపారుదల శాఖలో ఎం.డి.సమీయుద్దీన్ పర్యవేక్షణాధికారిగా పని చేసి 2013లో ఉద్యోగ విరమణ పొందారు. అతడు అవివాహితుడు. సమీయుద్దీన్ ఇద్దరు చెల్లెళ్లకూ వివాహం కాలేదు. ఉద్యోగ విరమణ చేసిన తరువాత వచ్చిన కొంతడబ్బును ఓ బ్యాంకు ఖాతాలో, మరికొంత నగదును తన సోదరి సబీహా సుల్తానా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. సమీయుద్దీన్ పని చేస్తున్న నీటిపారుదల శాఖలోనే జహంగీర్ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసేవారు. ఈ క్రమంలో జహంగీర్, సమీయుద్దీన్ కుటుంబాల మధ్య పరిచయం ఏర్పడింది. సమీయుద్దీన్ 2022లో మృతి చెందారు. అతడి బ్యాంకు ఖాతా, తన సోదరి సబీహా సుల్తానా బ్యాంకు ఖాతాల వివరాలు జహంగీర్ తెలుసుకున్నాడు. మూడు నెలల కింద కరీంనగర్‌లో జిమ్ నిర్వాహకుడైన మహ్మద్ ఆసిఫ్ పాషాకు విషయం తెలిపి అతడితో చేతులు కలిపాడు. సమీయుద్దీన్ వినియోగించిన చరవాణి నంబర్‌ను ఆసిఫ్ పాషా రద్దు చేయించి తన పేరు మీదకు మార్చుకున్నాడు. సాంకేతిక పరిజ్ఞానంతో సమీయుద్దీన్, సబీహా సుల్తానా బ్యాంకు ఖాతాల్లో ఎంత నగదు ఉందో తెలుసుకున్నారు. సబీహా సుల్తానా బ్యాంక్ ఖాతాలో నిల్వ ఉన్న రూ.20,18,557 నగదు ఉన్నట్లు గుర్తించారు. అవసరాల మేరకు యూపీఐ ద్వారా విడుతల వారీగా రూ.20 లక్షల మేర మళ్లించుకున్నారు. నెల కింద సబీహా సుల్తానా బ్యాంకు వెళ్లి రూ.లక్ష డ్రా చేసుకున్నారు. మిగతా నిల్వ ఉన్న నగదుపై విచారించగా ఖాతాలో కేవలం రూ.4 లక్షలు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆమె కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏసీపీ నరసింహారెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసును ఛేదించారు. నేరంలో కీలకపాత్ర పోషించిన ఆసిఫ్ పాషాను అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ.18 లక్షల నగదును రికవరీ చేశారు. జహంగీర్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు.

రామగుండం ఠాణాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు


గోదావరిఖని, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఠాణాల్లో సేవలు, ఫిర్యాదుదారులతో వ్యవహరించే తీరుపై రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని మూడు ఠాణాలకు గుర్తింపు దక్కింది. ఖని వన్‌టౌన్ స్టేషన్‌లో రిసెప్షన్ కేంద్రంలో పనిచేసే కానిస్టేబుల్ వెంకటలక్ష్మి బాధితులతో మర్యాదగా వ్యవహరించి.. సమస్య తెలుసుకొని ఠాణా అధికారి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించడంలో ప్రత్యేకత చాటుకున్నారు. దీనికి ఫిర్యాదుల నిర్వహణలో రాష్ట్ర వ్యాప్తంగా అయిదు ఉత్తమంగా ఉన్నవి ఎంపిక చేయగా.. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ నాలుగో స్థానంలో నిలిచింది. సమస్యలతో వచ్చే బాధితులకు వెంటనే స్పందించి సేవలందించే విధంగా బాధ్యతలు నిర్వహించిన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఒకటో పట్టణ సీఐ దేవయ్య, ధర్మారం ఠాణా ఎస్.ఐ లక్ష్మణ్‌లకు గుర్తింపు దక్కింది. దీంతో సత్వర సేవల విభాగంలో పదింటిలో బెల్లంపల్లి వన్‌టౌన్, ధర్మారం పోలీసుస్టేషన్‌లు వరుసగా మూడు, అయిదు స్థానాలు పొందాయి. ఆన్‌లైన్ ఫీడ్‌బ్యాక్ ద్వారా సేకరించిన సమాచారం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ స్థానాలను కేటాయించారు.


వెంకటలక్ష్మి


లక్ష్మణ్

ప్రైవేటు ఉపాధ్యాయులకు సౌకర్యాలు కల్పించండి

కరీంనగర్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎలాంటి ఆధారం లేని పలువురు పట్టభద్రులకు ప్రైవేటు పాఠశాలలు ఉపాధి కల్పిస్తున్నాయని తెలంగాణ ప్రభుత్వామోదిత పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వై.శేఖర్‌రావు తెలిపారు. కరీంనగర్‌లో మంగళవారం ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల పలువురి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు ఆరోగ్యకార్డులు, రూ.10 లక్షల ఆరోగ్య బీమా, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించాలని.. ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆలిండియా ప్రిన్సిపల్స్, లీడర్స్ అసోసియేషన్ ఫౌండర్, సెక్రటరీ డాక్టర్ ఎ.జోష్ణరావు, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.యాదగిరి, పలు జిల్లాల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, ఎం.తిరుపతిరెడ్డి, కె.కేశవరెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయినిగా సర్టిఫికెట్ అందిస్తున్న ట్రస్మా నాయకులు

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి హామీ

కోరిన వారికి జాబ్ కార్డు మంజూరు చేయాలని కేంద్రం ఆదేశాలు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్:

ట్రాన్స్‌జెండర్లు గౌరవప్రదంగా జీవించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకొంటున్నాయి. వారిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ట్రాఫిక్ వాలంటీర్లుగా నియమిస్తామని ప్రకటించగా.. ప్రస్తుతం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధిహామీ పని కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక ట్రాన్స్‌జెండర్‌కు జాబ్ కార్డు మంజూరు చేయాలని పేర్కొంది. దీనికి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో పల్లెల్లో ట్రాన్స్‌జెండర్ల గుర్తింపులో అధికారులు నిమగ్నమయ్యారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ వర్గాల కూలీల్లో ఇప్పటివరకు వ్యక్తిగతంగా లబ్ధిపొందిన వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు.

మార్గదర్శకాల్లో ముఖ్యాంశాలు

- ✦ ట్రాన్స్‌జెండర్లకు ఆధార్ ఆధారంగా జాబ్‌కార్డు ఇవ్వాలి.
- ✦ ఒక గ్రామంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటే గ్రూప్‌గా ఏర్పాటు చేయాలి.
- ✦ గ్రూప్ లేక వ్యక్తిగతంగా ఒకే ప్రాంతంలో పని కల్పించాలి.
- ✦ పని ప్రదేశంలో వారి పట్ల ఎలాంటి వివక్ష చూపరాదు. దీని కోసం మేట్లకు అవగాహన సదస్సులు నిర్వహించాలి.
- ✦ ట్రాన్స్‌జెండర్ల సమస్యల కోసం మండల, జిల్లా స్థాయిల్లో నోడల్ అధికారిని నియమించాలి.

178కి లబ్ధి

ఉమ్మడి జిల్లాలో ట్రాన్స్‌జెండర్లకు ఉపాధిపై భరోసా కలగనుంది. ఓటరు జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలో 178 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే కోరుట్లలో 4, జగిత్యాలలో 20, ధర్మపురిలో 6, రామగుండంలో 25, మంథనిలో 19, పెద్దపల్లిలో 9, కరీంనగర్‌లో 44, చొప్పదండిలో 7, వేములవాడలో 30, సిరిసిల్లలో 7, మానకొండూర్‌లో 1, హుజూరాబాద్‌లో 6 మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరే కాకుండా చాలా మంది ఓటు హక్కు పొందని వారు కూడా ఉన్నారు. వీరిలో 18 ఏళ్లు నిండిన వారికి జాబ్‌కార్డు మంజూరు చేయనున్నారు.

గ్రామాల వారీగా గుర్తింపు: రవీందర్ రాథోడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, పెద్దపల్లి

జిల్లాలోని గ్రామాల్లో ట్రాన్స్‌జెండర్లను గుర్తిస్తున్నారు. ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు మంజూరు చేస్తాం. ప్రత్యేకంగా పని కల్పించి.. వసతులు సమకూర్చనున్నాం. వారిపై వివక్ష చూపకుండా మాములు కూలీలకు అవగాహన కల్పిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా...
(10 AM TO 1 PM)
చందుర్తి: 9493188772
గంభీరావుపేట: 8008573611

న్యూస్‌టుడే, వేములవాడ గ్రామీణం

? వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - **మానుక పోషయ్య, స్థానికుడు**

✔ పారిశుద్ధ్య కార్మికులచే కాలువలను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరిస్తాం. - **సంపత్‌రెడ్డి, ఇన్‌ఛార్జి కమిషనర్, వేములవాడ**

నేర వార్తలు

బావిలో నుంచి మృతదేహం వెలికితీత

రాచర్ల బొప్పాపూర్(ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన అగుళ్ల శ్రీనివాస్(48) అనే వ్యక్తి తన కుమార్తె భవిష్యత్తుపై బెంగతో సోమవారం సాయంత్రం ఉపయోగంలో లేని వ్యవసాయబావిలో దూకి బలవన్మరణానికి పాల్పడిన విషయం విదితమే. మృతదేహాన్ని వెలికితీసేందుకు పోలీసు, అగ్నిమాపక అధికారులతోపాటు స్థానిక యువకులు 11 గంటలపాటు శ్రమించి ఎట్టకేలకు మంగళవారం ఉదయం బయటకు తీశారు. ఎస్సై రమాకాంత్ రాత్రి నుంచి ఉదయం వరకు క్షేత్రస్థాయిలో ఉండి, పరిస్థితిని సమీక్షించారు. ఎంపీటీసీ మాజీ సభ్యురాలి భర్త ఇల్లెందుల శ్రీనివాస్, భాజపాకు చెందిన యువకులు సహకరించారు.

ఆరుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన అగుళ్ల శ్రీనివాస్(48) అనే వ్యక్తి వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. శ్రీనివాస్ తన కుమార్తె రమ్యను సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీకాంత్‌కు కట్నకానుకలు ఇచ్చి 2014లో వివాహం చేశాడన్నారు. వారికి ఇద్దరు పిల్లలు రిషివర్ధన్, కీర్తన కలగగా పుట్టింటి నుంచి రూ. 5 లక్షలు అదనంగా తీసుకురావాలని రమ్యను అత్తింటి వారు వేధించారని పేర్కొన్నారు. ఈ నెల 20న తన కుమార్తెను తీసుకురావడానికి శ్రీనివాస్ వెళ్లగా నానా దుర్భాషలాడుతూ డబ్బులు తీసుకురావాలని డిమాండ్ చేశారన్నారు. ఇంటికి వచ్చిన శ్రీనివాస్ మనస్తాపంతో వ్యవసాయ బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడినట్లు చెప్పారు. మృతుడి కుమారుడు అగుళ్ల రాజేశ్ ఫిర్యాదు మేరకు రమ్య భర్త శ్రీకాంత్, అత్త లక్ష్మి, మామ వరస్వామి, శ్రీకాంత్ సోదరుడు ప్రశాంత్, వారి సమీప బంధువులు పద్మ, సతీశ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు వినతి

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వం ద్వారా ఉపాధి కల్పనలో భాగంగా జిల్లాలోని దివ్యాంగులకు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిపై ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా దివ్యాంగుల సమితి సభ్యులు మంగళవారం వేములవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు.



విప్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

దివ్యాంగులకు పెట్రోల్ బంకులు, వృద్ధాశ్రమం మాదిరి హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని విప్ తెలిపారన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సమితి జిల్లా అధ్యక్షుడు రాజేశ్, ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, రాజేందర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. రూ.25 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం అశోక్, సుల్తాన్ నర్సయ్య, రాజయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించండి

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: వార్పింగ్ యంత్రాలపై బీములు పోయించే మహిళా కార్మికులకు పూర్తిస్థాయిలో ఉపాధి లభించే విధంగా చర్యలు తీసుకోవాలని పాలిస్టర్ వార్పిన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) కార్యదర్శి మూషం రమేశ్ కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మంగళవారం చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం పవర్‌లూం వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన కార్మికులకు ఉపాధి కల్పించడంలో భాగంగా చీరల ఆర్డర్లు అందిస్తామని ప్రకటించిందని, చీరల వస్త్రానికి సంబంధించిన డిజైన్లను రూపొందించినట్లు తెలిపారు. పవర్‌లూం పరిశ్రమ స్తబ్ధతను అనుసరించి పని చేస్తున్న 300 మంది వార్పిన్ కార్మికులు, వారి కుటుంబాలకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వార్పింగ్ యంత్రాలపై బీములు పోయించే విధంగా డిజైన్లను రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిమల్ల సత్యం, ప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని అడ్డుకున్న గ్రామస్థులు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది దిన కేసీఆర్



నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

నగర్‌కు కేటాయించడాన్ని నిరసిస్తూ మంగళవారం పంచాయతీ ముందు గ్రామస్థులు మంగళవారం నిరసన తెలిపారు. మండెపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది ఇక్కడే పని చేయాలని, వారిని కేసీఆర్‌నగర్‌కు పంపించవద్దని గ్రామస్థులు వారిని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఎంపీవో మీర్జా అక్కడికి చేరుకుని వారిని శాంతింపజేసి ఆందోళనను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థి ఎంపిక

నిజామాబాద్ (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం నిజామాబాద్ ఆదర్శ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని మానుక శివానీ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎండీ పాషా



శివానీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

గ్రీన్ మంగళవారం తెలిపారు. సిరిసిల్లలో రెండు రోజుల క్రితం జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించగా ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. దీంతో ఆమెను హెచ్ఎంతోపాటు పీడీ సుంకెట అజయ్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు మంగ, తదితరులు అభినందించారు.

పక్కా భవనానికి మోక్షమెప్పుడో?

ప్రభుత్వాలు మారుతున్నా గ్రంథాలయానికి పక్కా భవనం మాత్రం నిర్మించడం లేదు. అరకొర వసతుల మధ్య అద్దె భవనంలో కొనసాగుతుంది. సౌకర్యాలు లేక పాఠకులు, నిరుద్యోగ యువత ఇబ్బందులు పడుతున్నారు.

నలభై ఏళ్లుగా అద్దె భవనంలో గ్రంథాలయం

న్యూస్‌టుడే, ముస్తాబాద్

ముస్తాబాద్ మండల కేంద్రంలో గ్రంథాలయం దాదాపు 40 ఏళ్లుగా అరకొర వసతుల మధ్య అద్దె భవనంలో కొనసాగుతుంది. అద్దె భవనాలు మారుతున్నాయి తప్ప పక్కా భవనం నిర్మించడం లేదు. దీంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు.

- గ్రంథాలయంలో 8,301 పుస్తకాలు ఉన్నాయి. 786 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. 2011 సంవత్సరంలో గ్రంథపాలకుడు విశ్వనాథం ఉద్యోగ విరమణ పొందాడు. అప్పటి నుంచి గంభీరావుపేట గ్రంథపాలకుడు అదనపు బాధ్యతలు చూస్తున్నారు.
- వారానికి మూడు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. మిగతా మూడు రోజులు గంభీరావుపేటలో విధులు నిర్వహిస్తుంటారు.
- గ్రంథపాలకుడు ఉన్న రోజుల్లో మాత్రమే పాఠకులకు పూర్తిస్థాయి మెటీరియల్ అందుబాటులో ఉంటుంది. మిగతా రోజుల్లో దిన, వార పత్రికలు మాత్రమే ఉంటున్నాయి.
- నిరుద్యోగ యువత డబ్బులు వెచ్చించి శిక్షణ కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేక కొందరు గ్రంథాలయానికి వచ్చి సన్నద్ధమవుతున్నారు. వీరికి అద్దె భవనంలో అరకొర వసతులు దర్శనమిస్తున్నాయి.



ముస్తాబాద్ గ్రంథాలయ అద్దె భవనం

- మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పక్కా భవనం నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

స్థల సేకరణకు తీర్మానించినా...



గత ప్రభుత్వ హయాంలో పక్కా భవనం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. పంచాయతీ పాలకవర్గం స్థల సేకరణకు తీర్మానించింది. పనులు మాత్రం ప్రారంభించలేదు. నిరుద్యోగ యువత ఉద్యోగ సన్నద్ధత ఎంతగానో తోడ్పడే గ్రంథాలయ భవన నిర్మాణంపై పాలకులు, అధికారులు దృష్టిసారించకపోవడం దురదృష్టం.

- చెవుల రాజు, స్థానిక యువకుడు



గ్రంథాలయంలో పుస్తకాలు

సద్వినియోగం చేసుకోవాలి

నేను గంభీరావుపేటతోపాటు ముస్తాబాద్ గ్రంథాలయం ఇన్‌ఛార్జి బాధ్యతలు చూస్తున్నాను. అందువల్ల బుధ, గురు శనివారాల్లో మాత్రమే ఇక్కడ అందుబాటులో ఉంటాను. మిగతా రోజుల్లో స్వీపర్ ఉంటుంది. నిరుద్యోగ యువతకు కావాల్సిన స్టడీ మెటీరియల్ గ్రంథాలయంలో ఉంది. సద్వినియోగం చేసుకోవాలి. ఉద్యోగ సన్నద్ధత కోసం వచ్చే వారికి ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెరిచి ఉంటుంది.

- మహ్మద్ గులాంహుస్సేన్, ఇన్‌ఛార్జి గ్రంథపాలకుడు

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర పారిశ్రామిక రక్షణ సంస్థ (సీఐఎస్ఎఫ్)లో కానిస్టేబుల్ (ఫైర్) 2024కు సంబంధించిన రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో వెలువడిందని, అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి ఎ. రాందాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 30న ముగుస్తుందని, పూర్తి వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అభ్యర్థులకు కావాల్సిన వివరాలను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ప్రవేశాలకు...

బోయినపల్లి: ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రఘునాథ్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఈనెల 30లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

26న పాఠశాల ప్రారంభం

బోయినపల్లి, న్యూస్‌టుడే: కొదురుపాకలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ తన అమ్మమ్మ, తాతయ్యల జ్ఞాపకార్థం నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఈ నెల 26న ప్రారంభించనున్నట్లు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. గతంలోనే రైతు వేదిక నిర్మాణం చేపట్టి అమ్మమ్మ, తాతయ్యల గ్రామంపై కేటీఆర్ తన మమకారాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు. పాఠశాల భవనం ప్రారంభంలో భారాస నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దుమాల(ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన న్యాలకొండ రాకేష్‌రెడ్డి అనే యువకుడు గణపతి నిమజ్జనంలో ట్రాక్టర్ కిందపడి మృతి చెందగా బాధిత కుటుంబానికి దాతలు అండగా నిలిచారు.



నగదు అందిస్తున్న దాతలు

స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు, ఇతర దాతలు పోగు చేసిన రూ. 87,100 నగదును అతని తల్లి మాధవికి మంగళవారం అందించి ఔదార్యం చాటుకున్నారు. మాజీ సర్పంచి కదిరె రజిత, నాయకులు శ్రీనివాస్, పొన్నం బాలకిషన్, గుల్లపెల్లి నర్సింహారెడ్డి, కొలనూరి శంకర్, రేండ్ల హన్మంతు, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు తదితరులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వాట్సప్ గ్రూపు సభ్యుల చేయూత

సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటకు చెందిన నేత కార్మికుడు కొండబత్తిని సూర్యనారాయణ ఇటీవల మరణించగా బాధిత కుటుంబానికి



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

పల్లెకబుర్లు వాట్సప్ గ్రూప్ సభ్యులు మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో రూ. 24 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో 12వ వార్డు భారాస అధ్యక్షుడు విరగోని శ్రీనివాస్ గౌడ్, పాల ఉత్పత్తిదారుల సంఘం ఛైర్మన్ కిషన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కు అందజేత

బోయినపల్లి, న్యూస్‌టుడే: విలాసాగర్ గ్రామానికి చెందిన పోలె కొమురయ్యకు రూ.14 వేల పరిహారం చెక్కును మంగళవారం సెస్ డైరెక్టర్ సుధాకర్, ఏఈ ప్రశాంత్ అందించారు. కొమురయ్య తన గొర్రెల మందను మేతకు తీసుకెళ్లగా వరద కాలువ సమీపంలో విద్యుత్తు తీగ తెగిపడి రెండు గొర్రెలు మృతి చెందాయి. వైద్యాధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా నష్టపరిహారం చెక్కు అందించినట్లు సెస్ డైరెక్టర్ తెలిపారు.

దివ్యాంగుల బస్‌పాస్ మేళా

సిరిసిల్ల పట్టణం, న్యూస్‌టుడే: దివ్యాంగులకు బస్‌పాస్ జారీకి ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం వైకల్యం కలిగిన వ్యక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 30న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండులోని కౌంటర్‌లో పాసుపోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్, సదరం ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు.

బోధన సిబ్బంది నియామకానికి ముఖాముఖి

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని మైనారిటీ విద్యాసంస్థల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో ముఖాముఖి నిర్వహించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధ్యక్షతన



ముఖాముఖి నిర్వహిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

నిర్వహించారు. మొత్తం 48 మంది అభ్యర్థులకు గాను 32 మంది హాజరయ్యారు. 16 మంది గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మైనార్టీ అధికారి రాధాబాయి, ఓఎస్‌డీ సర్వర్ మియా, ఆర్ఎల్‌సీ రాజేందర్, ప్రిన్సిపాళ్లు లక్ష్మీనారాయణ, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ దినోత్సవం



మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల నృత్యం

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని శాత్రాజుపల్లి రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో, పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేఫ్టీ ఆఫ్ ద గర్ల్ చైల్డ్ అనే అంశంపై విద్యార్థినులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. అనంతరం సేవ్ ద వాటర్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ మూకీ డ్రామా, నృత్య ప్రదర్శన, పాటలతో అలరించారు. జూనియర్ కళాశాలలో రంగోళి, పెయింటింగ్, ఉపన్యాస పోటీలు జరిపి విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాళ్లు పీఎస్ఆర్ శర్మ, సీహెచ్ శరత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు స్వప్న, అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటుగా సేవా కార్యక్రమాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ విజయ్ రఘునందన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వివేకానంద, అధ్యాపకులు శ్రీధర్, శ్రీనివాస్‌రావు, ఆంజనేయులు, చంద్రమౌళి, కనకయ్య, సురేశ్, శశిధర్, చంద్రమౌళి, శ్రీనివాస్, సుజిత, వర్ష, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలంటూ నగర సంకీర్తన

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో హిందూ ధర్మాన్ని, పవిత్రతను కాపాడాలని కోరుతూ ఎల్లారెడ్డిపేటలో హిందూ ధర్మ ప్రచార కమిటీ ఆధ్వర్యంలోని భక్తులు మంగళవారం నగరసంకీర్తన నిర్వహించారు.



నగర సంకీర్తనలో కమిటీ సభ్యులు, భక్తులు

మండల కేంద్రంలోని మార్కండేయస్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ శ్రీవేణుగోపాలస్వామి ఆలయం, అంబేడ్కర్ విగ్రహం, కొత్తబస్టాండు మీదుగా పాతబస్టాండు వరకు కొనసాగింది. భజనలు, భక్తిపాటలతో నగర సంకీర్తన నిర్వహించిన అనంతరం టపాసులు కాల్చి ముగింపు పలికారు. తిరుపతిలో లడ్డూను కల్తీచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ ప్రతినిధులు ముత్యాల ప్రభాకర్ రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ జితేందర్, ప్రధాన కార్యదర్శి గంట వెంకటేశ్‌గౌడ్, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు ఈశ్వర్, మాజీ అధ్యక్షుడు నంది కిషన్, కేశవపెరుమాండ్ల ఆలయ కమిటీ అధ్యక్షుడు రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ ఛైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

నామాపూర్ (ముస్తాబాద్), న్యూస్‌టుడే: పార్టీ ఆదేశాల మేరకు ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో భాజపా మండల అధ్యక్షుడు మేర్గు అంజాగౌడ్ మంగళవారం సభ్యత్వ అభియాన్ కార్యక్రమం చేపట్టారు. పలువురికి భాజపా సభ్యత్వం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు బూత్‌లలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు భాజపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నామాపూర్‌లో సభ్యత్వం అందిస్తున్న భాజపా మండల అధ్యక్షుడు అంజాగౌడ్

తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలి

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్తు కార్యాలయంలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు మంగళవారం శిక్షణ



మాట్లాడుతున్న మిషన్ భగీరథ సీఈ అమరేందర్

కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సరఫరా చేస్తున్న మంచినీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేస్తూ పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలన్నారు. ట్యాంకులను నెలలో మూడు సార్లు శుభ్రం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ విజయ్ కుమార్, గ్రిడ్ ఏఈలు అభిషేక్, శ్రావణి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జా హమ్మద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

సహాయకులకు శిక్షణ

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామాల్లో పని చేసే మంచినీటి సహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో చేతిపంపుల మరమ్మతు, కొత్త చేతిపంపులు, పైపుల బిగింపుపై సాంకేతిక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేశ్, నవీన్, ఎంపీవో తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం

రాజన్నపేట(ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో రాచర్ల గొల్లపల్లిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. వీధుల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి, శుభ్రపరిచారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను గ్రామస్థులకు వివరిస్తూ విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. గ్రామంలో స్వచ్ఛతను పాటిస్తామని గ్రామస్థులు ప్రతినబూనారు. పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. అనంతరం బ్యాంకు పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ మంగ అర్పిత, మాజీ సర్పంచి ముక్క శంకర్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రాజన్నపేటలో విద్యార్థుల మానవహారం

బస్సులో ప్రయాణికుడికి తీవ్ర అస్వస్థత

ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లెకు చెందిన వృద్ధుడు వట్టిమల్ల ఎల్లయ్య (67) తీవ్ర అస్వస్థతకు గురికాగా 108 వాహనంలో సిరిసిల్లకు తరలిస్తుండగా మంగళవారం సాయంత్రం మార్గమధ్యలో మృతి చెందాడు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎల్లయ్యను అతని భార్య రాజవ్వ కరీంనగర్‌లోని ఆసుపత్రికి ఆర్టీసీ బస్సులో తీసుకెళ్తుంది. ఎల్లయ్య తీవ్ర అస్వస్థతకు గురికావడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి వద్ద దింపేశారు. ఈ మేరకు స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. అతనిని సిరిసిల్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలిస్తుండగా గుండెపోటుతో మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు.

కోళ్ల దుకాణాల నిర్వాహకులకు నోటీసులు జారీ

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ ఆలయ పరిసరాల్లోని కోళ్లు, చికెన్ విక్రయ దుకాణదారులకు మంగళవారం మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. దుకాణాల నిర్వహణ సక్రమంగా లేక దుర్వాసన రావడంతో భక్తులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి గంటకూ శుభ్రం చేయాలని సూచించారు.



వ్యాపారికి నోటీసు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కోళ్లు నిల్వ చేసే జాలీలను రోడ్లపైన, దుకాణం ముందు పెట్టవద్దని, వ్యర్థాలను సేకరించే వాహనంలోనే వేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం, జరిమానా విధించడం జరుగుతుందని పేర్కొన్నారు. మంగళవారం 16 మందికి నోటీసులు జారీ చేసినట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ సంపత్‌రెడ్డి తెలిపారు.

రైస్‌మిల్లులను పరిశీలించిన అధికారులు

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: వేములవాడ గ్రామీణ మండలం మర్రిపల్లిలో మల్లయకుంట చెరువును పూడ్చివేసి అక్రమంగా రైస్ మిల్లులను నిర్మించారని, వాటి నుంచి వస్తున్న వ్యర్థాల



అనుమతి పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

వల్ల తమ పంట పొలాలు, నీరు కాలుష్యమవుతున్నాయని గ్రామస్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా మంగళవారం అధికారులు పరిశీలించారు. రైస్ మిల్లుల అనుమతి పత్రాలు, వివిధ శాఖల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. రైస్‌మిల్లుల సమీపంలోని మట్టి, నీటి నమూనాలను సేకరించారు. పక్కనే ఉన్న కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థినులు, అధ్యాపకులతో మాట్లాడారు. బుధవారం సర్వేయర్‌తో సర్వే చేయించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, గ్రామీణ తహసీల్దార్ సుజాత, పరిశ్రమలశాఖ ఎ.డి. భారతి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి కనకజ్యోతి, పట్టణ ప్రణాళిక అధికారి అన్సారి, ఎంపీవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి

వీర్నపల్లి. న్యూస్‌టుడే: క్లిష్ట పరిస్థితుల్లో మానసిక ఒత్తిడిని అధిగమించేలా సన్నద్ధం కావాలని మానసిక నిపుణుడు ప్రవీణ్ పేర్కొన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీలో మంగళవారం విద్యార్థులతో మాట్లాడారు. వ్యక్తిగత ఇబ్బందులు తెలుసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు.



మాట్లాడుతున్న మానసిక నిపుణుడు ప్రవీణ్

ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి చిరంజీవి, ప్రత్యేకాధికారి లింగమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ చైతన్య, ఏఎన్ఎంలు సుజాత, కీర్తి పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో పంటలు ధ్వంసం

ధర్మారం (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం ధర్మారంలో అడవి పందుల దాడిలో మంగళవారం తెల్లవారుజామున సుమారు మూడెకరాల్లోని వరి పంట ధ్వంసమైంది. గ్రామానికి చెందిన బొడ్డు శంకర్ వరి పంట, బొడ్డు ప్రభాకర్, మల్లెవేణి తిరుపతిలకు చెందిన పత్తి పంటను పాడు చేశాయి. తీవ్ర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ, అటవీశాఖ అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి ప్రభుత్వపరంగా పరిహారం అందించాలని కోరారు.